ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -136 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం 23 జూన్ 2026

## లక్నో కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

15 మంది సజీవ దహనం



ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన

సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

**లక్నో : జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** భవిష్యత్ గురించి కలలు కంటూ ఉద్యోగ కలలను సాకారం చేసుకోవటానికి కోచింగ్ సెంటర్లలో చేరితేఅవి ప్రాణాలు తోడేస్తున్నాయి. సరిగ్గా రెండేండ్ల కిందట ఢిల్లీలో ఓ కోచింగ్ సెంటర్ లో జల సమాధి అయిన విషయం విదితమే. తాజాగా యూపీలోనూ ఓ కోచింగ్ సెంటర్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో అసువులు బాశారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నో లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్లో అమాంతంగా మంటలు ఎగిసిపడ్డాయి. **మిగతా 2లో...**

## గొడ్డలి పార్టీ దుష్ప్రచారం

### ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు హెచ్చరిక

ఉద్యోగులు అప్రమత్తం కావాలి

రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు

రాజకీయం రంగు పులుముతున్న నేతలు

ప్రజల సమస్యల పరిష్కారంలో మానవీయకోణం ముఖ్యం



**అమరావతి,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని.. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. వివిధ ఘటనలకు కులమతాల రంగు పులుముతున్నారని.. వాటిని వివాదాస్పద అంశాలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీజీఎస్‌పై సమీక్షలో భాగంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు అన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని వ్యాఖ్యానించారు. **మిగతా 2లో...**

## టిటిడితో పాటు అన్ని దేవాలయాల్లో ప్రక్షాళన

రెండేళ్లుగా వైదికంగా ముందుకు తీసుకెళ్లు ప్రయత్నం

జగన్ పాలనలో ఆయాలను భ్రష్టు పట్టించారు

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**అమరావతి,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** దేవాలయాలు సమాజంలో భాగమని, అక్కడి కార్యక్రమాలు ప్రజల్లో భాగమని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. టీటీడీతో పాటు అన్ని దేవాలయాలను ప్రక్షాళన చేయడంతో పాటు వైదికంగా ముందుకు తీసుకెళ్లడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి చెప్పారు. **మిగతా 2లో...**

## సమాజ సేవకు చిరునామా

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవాల్లో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతిలో 1000 పడకల ఆసుపత్రి ఏర్పాటును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు ప్రకటన

బాలకృష్ణ నాయకత్వంలో సంస్థ 'అన్‌స్టాపబుల్'గా దూసుకెళుతోందని కొనియాడిన చంద్రబాబు

**హైదరాబాద్‌జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రి చైర్మన్, తన బావమరిది అయిన నందమూరి బాలకృష్ణపై ప్రశంసల వర్షం కురిపించారు. "మొన్నటి వరకు సినిమాల్లోనే చప్పట్లు కొట్టించుకున్న బాలకృష్ణ, రేపటి రోజున సమాజ సేవలో ఎవరు మేటి అంటే దానికి చిరునామాగా నిలుస్తారు" **మిగతా 2లో...**




## రైల్వేమంత్రితో సీఎం భేటీ

అపాయింట్‌మెంట్ ఇప్పించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఐఆర్‌ఎఫ్‌సీ రుణం ఇప్పించాలని విజ్ఞప్తి

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రులతో

వరుస భేటీలుఢఢిల్లీలో సీఎం బిజీ బిజీ

**న్యూఢిల్లీ,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే అడ్డు అని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఢిల్లీలో ఆయనతో కలిసి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. మెట్రోరైల్ ఫేజ్-2కు సంబంధించి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) రుణాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారని సచివాలయంలో మంత్రులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి ఫైర్ అయిన సీఎం సోమవారం అదే కేంద్రమంత్రి **మిగతా 2లో...**



## జనసేన బలోపేతం లక్ష్యంగా కీలక నిర్ణయం

సమాచార సేకరణకు పరిశీలకుల నియామకం






## చర్చలు సానుకూలం

ముగిసిన ఉన్నత స్థాయి సమావేశం

తుది ఒప్పందం కోసం కార్యాచరణ ప్రణాళిక

లెబనాన్‌లో ఘర్షణల నివారణకు సెల్ ఏర్పాటు

సాంకేతిక అంశాలపై సంప్రదింపులు ప్రారంభం

**న్యూఢిల్లీ,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్‌లో ఆదివారం ప్రారంభమైన ఉన్నత స్థాయి చర్చలు సోమవారం ఉదయం ముగిశాయి. ఈ వారంలో సాంకేతిక స్థాయి చర్చలను కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. లెబనాన్‌లో జరుగుతున్న పోరును నివారించడానికి ఓ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకారం కుదిరింది. **మిగతా 2లో...**

## 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపి

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా కృషి

ఎపి రూపురేఖలు మార్చేలా చంద్రబాబు వేగంగా అడుగులు

ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధప్రదేశ్ ఐటీ,**మిగతా 2లో...**



## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

: ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి

నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష

జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు

**హైదరాబాద్‌జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. **మిగతా 2లో...**



# లక్నో కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**మొదటి పేజీ తరువాయి**

మూడు అంతస్తుల వాణిజ్య భవనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. రెప్పపాటులో మంటలు వేగంగా వ్యాపించి అదే భవనంలోని రెండో అంతస్తులో ఉన్న కోచింగ్ సెంటర్, గేమింగ్ జోన్, సాఫ్ట్వేర్ ఆఫీసులను చుట్టుముట్టాయి. మంటల్లో చిక్కుకుని కోచింగ్ సెంటర్‌లోని పలువురు సజీవదహనం అయ్యారు. తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే ఈ అగ్ని ప్రమాదంలో మొదట 8 మంది మృతి చెందగా, ఇప్పుడు ఆ సంఖ్య 15కు పెరిగింది. ఇద్దరు చిన్నారులతో సహా ఏడుగురు గాయపడ్డారు. ప్రస్తుతం వారిని ఆస్ప త్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా మంటలు నుంచి తప్పించుకునేందుకు భవనంలోపల ఉన్న విద్యార్థులు కిందకు దూకేసిన దృశ్యాలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఏకంగా 14 ఫైర్ ఇంజిన్లు, ఒక హైడ్రాలిక్ ప్లాట్‌ఫారమ్ వాహనంతో మంటలను ఆర్పివేశారు. భవనం లోపల దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో భవనం గోడను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. యూపీ ఉపముఖ్యమంత్రి బ్రిజేశ్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కొందరు విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని చెప్పారు. రెస్క్యూ సిబ్బంది ప్రతి గదిని, బాత్రూమ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని తెలిపారు.

**ప్రత్యక్ష సాక్షులు ఏం చెప్పారు?**

వాణిజ్య భవనంలో మొదట మూడో అంతస్తులో మంటలు అంటుకున్నాయి. అయితే చూస్తుండగానే అవి ఆఫీస్ మొత్తాన్ని చుట్టుముట్టాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్యాలయంలో 20 నుంచి 30 మందికి పైగా ఉండొచ్చని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో అక్కడ ఒక్కసారిగా తొక్కిసలాట, గందరగోళం ఏర్పడింది. భవనంలో పనిచేస్తున్న వారు, ఇతరులు తమ ప్రాణాలను రక్షించుకోవడానికి అటూఇటూ పరుగులు తీశారు. బయటకు రావడానికి ఎలాంటి దారులు కనిపించక పోవడంతో, పక్కనే వేలాడుతున్న ఒక వైర్ను పట్టుకొని కిందకు దూకడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక యువతి సహా ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రధాని కార్యాలయం ప్రకటించింది. క్షతగాత్రులకు రూ. 50వేలు ఇవ్వనున్నట్టు పేర్కొంది. భవనంలో ఎంతమంది చిక్కుకున్నారు? ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

**ప్రమాదంపై విచారణకు యోగి ఆదేశం**

మరోవైపు యూపీ రాజధానిలో అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే, సీఎం యోగి ఆదిత్యనాథ్ అలీగఢ్ పర్యటనను మధ్యలోనే ముగించుకొని లక్నోకు తెరిగి వచ్చారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకొని నివేదిక సమర్పించాలని డీజీపీ, హోంశాఖకు చెందిన అదనపు ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

**మొదటి పేజీ తరువాయి**

ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేష్ గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక రక్షణ ప్రాజెక్ట్ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం.గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో మన రాష్ట్ర గొంతు ఎంతో బలంగా వినబడుతోందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా, అమరావతి నాలెడ్జ్ హబ్ గా, రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారబోతున్నాయని అన్నారు. రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# సమాజ సేవకు చిరునామా

**మొదటి పేజీ తరువాయి**

అని చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రులు దామోదర రాజనర్సింహ, సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు.

ఆసుపత్రి ఏర్పాటు వెనుక ఉన్న నేపథ్యాన్ని, తన అత్తగారైన బసవతారకం గారు క్యాన్సర్‌తో పడిన బాధను చంద్రబాబు భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో క్యాన్సర్‌ను 'రాచపుండు' అనేవారని, సరైన వైద్య సదుపాయాలు లేక ఆమె ఎంతో వేదన అనుభవించారని తెలిపారు. ఆమె మరణం తర్వాత ఎన్టీఆర్ గారు తీవ్రమైన వేదనకు గురయ్యారని, పేదలకు శాశ్వతంగా ఒక మంచి ఆసుపత్రి కట్టాలనే ఆయన ఆలోచనే ఈ సంస్థకు పునాది వేసిందని వివరించారు.

ఆనాడు ఎన్టీఆర్ గారు ప్రభుత్వం తరఫున భూమి కేటాయించినప్పటికీ, 1989లో ప్రభుత్వం మారడంతో ఆసుపత్రి నిర్మాణం ముందుకు సాగలేదని, మళ్లీ 1996-97 వరకు దానిపై దృష్టి పెట్టలేకపోయామని తెలిపారు. దివంగత కోడెల శివప్రసాదరావు, ఎన్‌ఆర్‌ఐల సహకారంతో ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామన్నారు.

"తండ్రి ఒక మొక్క నాటితే, కొడుకుగా బాలకృష్ణ బాధ్యత తీసుకుని దాన్ని ఒక మహా కల్పవృక్షంగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుంది" అని చంద్రబాబు కొనియాడారు. ఒకానొక దశలో సంస్థ మనుగడపైనే అనుమానాలు వచ్చినప్పుడు, 15 ఏళ్ల క్రితం బాలకృష్ణకు బాధ్యతలు అప్పగించామని, అప్పటి నుంచి ఈ వ్యవస్థను 'అన్‌స్టాపబుల్'గా ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు. సినిమాల్లో ఎవర్ గ్రీన్ హీరోగా, హిందూపురం ఎమ్మెల్యేగా తీరిక లేకుండా ఉన్నప్పటికీ, క్యాన్సర్ రోగుల పట్ల ఆయన చూపే కరుణ, సేవ చేయాలన్న తపనే ఈ సంస్థను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు.

ప్రారంభంలో 100 పడకలతో మొదలైన ఆసుపత్రి, నేడు 650 పడకల స్థాయికి పెరిగిందని, 250 మందికి పైగా నిపుణులైన వైద్యులతో సేవలందిస్తోందని చంద్రబాబు వివరించారు. ఏటా 3 లక్షల మందికి పైగా ఔట్ పేషెంట్లకు, 90 వేల మంది ఇన్ పేషెంట్లకు సేవలు అందిస్తూ, సంవత్సరానికి 8,000 ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. అమరావతిలో 1000 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు బాలకృష్ణ, యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని, దాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని ప్రకటించారు.

ప్రభుత్వాలు మాత్రమే ప్రజారోగ్యాన్ని కాపాడలేవని, లాభాపేక్షతో నడిచే ప్రైవేటు ఆసుపత్రుల మధ్య, బసవతారకం వంటి లాభాపేక్ష లేని సంస్థలు (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్) మరిన్ని రావాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. తల్లి పేరుతో బాలకృష్ణ, తండ్రి పేరుతో భువనేశ్వరి (ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్) సేవా కార్యక్రమాలు చేయడం ఎన్టీఆర్ కుటుంబం యొక్క విశిష్టత అని పేర్కొన్నారు. డబ్బు సంపాదించే అవకాశాలున్నా, పేదలకు సేవ చేయడంలోనే వారు ఆనందాన్ని వెతుక్కుంటున్నారని అన్నారు. బాలకృష్ణ నాయకత్వంలో రాబోయే 25 ఏళ్లలో బసవతారకం దేశంలోనే నంబర్ వన్ నాన్-ప్రాఫిట్ సంస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి పనికి విరాళాలు ఇవ్వాలనుకునే వారికి ఇది ఉత్తమ వేదిక అని సూచిస్తూ, 50వ వార్షికోత్సవాన్ని కూడా ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# రైల్వేమంత్రితో సీఎం భేటీ

**మొదటి పేజీ తరువాయి**

కిషన్‌రెడ్డితో కలిసి అదే ఐఆర్‌ఎఫ్‌సీ రుణాన్ని త్వరగా మంజూరు చేయాలని రైల్వేమంత్రిని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 అనుమతులపై చర్చించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై ఓ వినతిపత్రాన్ని సమర్పించారు. రైల్వేమంత్రితో అపాయింట్‌మెంట్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే ఇప్పించారని సమాచారం. ఇటీవలి కాలంలో సీఎం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. అభివృద్ధి పేరుతో బీజేపీపై సీఎం చేస్తున్న విమర్శలు, రాష్ట్రంలో ఆపార్టీకి రెండోస్థానం కల్పించడం కోసమేననే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్న సమయంలో ఢిల్లీలో కిషన్‌రెడ్డి, సీఎం కలిసి రైల్వే మంత్రిని కలవడం చర్చనీయాంశంగా మారింది. దీనివల్ల ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ భూముల్ని రాష్ట ప్రభుత్వానికి బదలాయిస్తూ రక్షణ శాఖ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో ఆయన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఇండియన్ ఎయిర్ ఫోర్స్(ఐఏఎఫ్) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే దేవరకద్రలో డీఆర్ డీవో ప్రాజెక్ట్ తో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ డెవలప్మెంట్ లో భాగమైన 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు ప్రత్యేకంగా సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో (ఎంఆర్వో), హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయన్నాయని కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. ఈ విషయంలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ హ్యాంగర్ ఏర్పాటుకు అత్యంత అనుకూలమైందన్నారు. ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి సీఎం కోరారు. అలాగేడ తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# జనసేన బలోపేతం లక్ష్యంగా కీలక నిర్ణయం

## సమాచార సేకరణకు పరిశీలకుల నియామకం

**అమరావతి,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :**

జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పదవుల కోసం దరఖాస్తుల స్వీకరణ, నాయకుల అభిప్రాయాల సేకరణ కోసం 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు సమాచార సేకరణ కమిటీ పరిశీలకులను నియమించారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకులు, జనసైనికులు, వీర మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ఈ కమిటీలు పనిచేయనున్నాయి. పార్టీలో ఏ స్థాయి బాధ్యతలు చేపట్టాలనుకుంటున్నారో దరఖాస్తుదారుల అభిప్రాయాలను కూడా సేకరించనున్నాయి. ప్రతి పరిశీలకుడికి ముగ్గురు సీనియర్ నాయకులు, ముగ్గురు సాధకులు, 21 మంది సమన్వయకర్తలు సహకరించనున్నారు. సేకరించిన దరఖాస్తులను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించనుండగా, వాటిని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్వయంగా పరిశీలించనున్నారు. తుది నిర్ణయం పార్టీ అధ్యక్షుడిదేనని జనసేన స్పష్టం చేసింది. ఈ నెల 29వ తేదీ నుంచి సమాచార సేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించనున్నారు. పార్టీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఉన్న 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు సీనియర్ నేతలను పరిశీలకులుగా నియమించారు. వీరు స్థానిక స్థాయిలో పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి కేంద్ర నాయకత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఈ నియామకాలతో పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అవుతుందని జనసేన వర్గాలు భావిస్తున్నాయి.

# చర్చలు సానుకూలం

**మొదటి పేజీ తరువాయి**

ఈ మేరకు మధ్యవర్తిత్వ దేశాలైన పాకిస్తాన్, ఖతార్ విదేశాంగ శాఖలు ఓ ప్రకటనను విడుదల చేశాయి. అరవై రోజులలో తుది ఒప్పందం కుదుర్చుకోవడానికి వీలుగా ఓ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగిందని ఆ ప్రకటన తెలియజేసింది. సంప్రదింపులు సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని వివరించింది. చర్చలలో ఇరాన్, అమెరికా ప్రతినిధి బృందాలతో పాటు పాకిస్తాన్, ఖతార్ నేతలు కూడా పాల్గొన్నారు. చర్చల అనంతరం ఆయా దేశాల ప్రతినిధి బృందాలు స్విట్జర్లాండ్ నుంచి తిరుగుముఖం పట్టాయి. సాంకేతిక, నిపుణుల స్థాయి బృందాలు చర్చల ప్రక్రియను కొనసాగిస్తున్నాయి.ఆదివారం జరిగిన చర్చలలో చోటుచేసుకున్న కీలక పరిణామం ఏమిటంటే రాజకీయ పర్యవేక్షణతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా ఆంక్షలు, వివాదాల పరిష్కారం వంటి అంశాలపై తదుపరి సాంకేతిక చర్చలను తక్షణమే ప్రారంభించడానికి ఈ కమిటీ పునాది వేస్తుంది. లెబనాన్‌లో ఘర్షణల నివారణ కోసం ఓ విభాగాన్ని ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం కూడా కీలకమైనదే. లెబనాన్‌లో ఘర్షణలను నివారించే విషయంలో ఈ సమావేశం మంచి పురోగతి సాధించిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలియజేశారు. ఇరాన్ చమురుపై విధించిన ఆంక్షలను అమెరికా ఎత్తివేసిందని, స్తంభింపజేసిన కొన్ని ఆస్తులను విడుదల చేసిందని చెప్పారు. ఇరాన్ పునర్నిర్మాణం-అభివృద్ధి ప్రణాళిక కూడా మొదలైందని అన్నారు. కాగా హోర్ముజ్ జలసంధి కోసం 'లైన్ ఆఫ్ కమ్యూనికేషన్'ను ఏర్పాటు చేయడం జరిగిందని మధ్యవర్తులు తెలిపారు. రానున్న చర్చలలో భాగంగా దక్షిణ లెబనాన్‌లోని చిన్న చిన్న ఆక్రమిత ప్రాంతాల నుంచి వైదొలిగే విషయంపై ప్రకటన చేయాలని ఇజ్రాయిల్ భావిస్తోందని తెలుస్తోంది.

# గొడ్డలి పార్టీ దుష్ప్రచారం

**మొదటి పేజీ తరువాయి**

2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని చెప్పారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. తప్పుచేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంచ్ చేసేలోపు క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు.పీజీఆర్ఎస్ అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదులను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో పని చేసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలతో వ్యవహరించే సమయంలో సౌమ్యంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. దీనివల్ల పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఉద్యోగులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని చెప్పారు. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనలను అదుపు చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని సీఎం పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు.

కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# టిటిడితో పాటు అన్ని దేవాలయాల్లో ప్రక్షాళన

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి సూచనలు, సలహాలతో అత్యంత పవిత్రమైన ఆలోచనతో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఆధ్యాత్మిక, సనాతన పరిరక్షణ కేంద్రాలుగా అనేక ఆలయాలను తీసుకువచ్చామని తెలిపారు. రెండేళ్ల పాలన గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలనేది ముఖ్యమంత్రి అభిమతమని.. దానిలో భాగంగా వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖలో రెండు సంవత్సరాల ప్రగతిపై ఆనం మాట్లాడుతూ.. 2019-24 మధ్య రాష్ట్రంలో విచ్చిన్నకరమైన వాతావరణం ఉందని విమర్శించారు. దేవాలయాలు సమాజంలో భాగమనే విషయాన్ని నాడు మర్చిపోయారని మండిపడ్డారు. 2024లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభించాలని భావించినప్పుడు అప్పటికే భక్తులు, హిందూ బంధువులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి శిరచ్ఛేదం, దుర్గమ్మ క్షేత్రంలో వెండిసింహాలు మాయం, అంతర్వేదిలో రథం దగ్ధం వంటి అనేక సంఘటనలు నాడు జరిగాయని గుర్తుచేశారు. నాడు ఆ ప్రభుత్వం కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయం తక్కువ ఉన్న ఆలయాల్లో దీపం వెలిగించే పరిస్థితి నాడు లేదని.. దీంతో ఆయా ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రతినెలా పదివేల రూపాయలు ఇస్తున్నట్లు చెప్పారు. 692 ఆలయాల్లో పనులను ప్రారంభించామని.. కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు సమకూర్చుతున్నామని చెప్పారు. టీటీడీ సౌలభ్యంతో రాష్ట్ర దేవాదాయ శాఖ ద్వారా భజన మందిరాలు నిర్మాణం చేయాలని నిర్ణయించామన్నారు. దేవాదాయ శాఖలో డిజిటల్ ట్రాన్సఫర్మేషన్ తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. మన మిత్రా వాట్సాప్ గ్రూప్ ద్వారా అనేక సేవలు దర్శనం, ప్రసాదాలు, వసతి కల్పన చేస్తున్నామన్నారు. అంతా ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేయడంతో భగవంతుడి పేరుతో

చేసే మోసాలను చాలా వరకూ తగ్గించగలిగామని చెప్పారు. డిజిటల్ వ్యవస్థతో దేవాలయ సేవల పట్ల ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చాక 970 ధర్మకర్తల మండలిలను నియమించామని తెలిపారు. 449 ఆలయాలకు పాలకమండలిని నియమించాలన్నారు. రాబోయే రోజుల్లో 65 ఆలయాల్లో అన్నప్రసాద వితరణకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు చెప్పారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రి దేవాలయంలో నకిలీ టికెట్ల వ్యవహారంపై అంశంపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. గతంలో సమర్పించిన నివేదికలు పూర్తిస్థాయిలో లేవని భావిస్తున్నామని, అందుకే కొత్తగా విచారణ చేపట్టాలని నిర్ణయించామని స్పష్టం చేశారు.

తప్పు చేసిన అధికారులు, బాధ్యులు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో ఆలయాల్లో జరిగిన అక్రమాలు, పరిపాలనా లోపాలపై కూడా సమగ్రంగా పరిశీలిస్తున్నామని అన్నారు. గతంలో నివేదికలు సమర్పించిన అధికారుల పాత్రపైనా విచారణ చేస్తామని పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు చెందిన భూముల పరిరక్షణపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఆనం స్పష్టం చేశారు. గతంలో జమీందారులు, ఇనాందారులు ఆలయాల నిర్వహణ కోసం భూములను కేటాయించేవారని, ప్రస్తుతం అలాంటి ఇనాం భూములు వేల ఎకరాల మేర ఉన్నాయని తెలిపారు. జగన్ హయాంలో నిర్లక్ష్యం కారణంగా ఆలయాల ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని మంత్రి ఆనం ఆరోపించారు. ప్రస్తుతం అలాంటి భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. దేవాదాయ శాఖ రికార్డుల ప్రకారం లక్షల ఎకరాల ఆస్తులు గుర్తించామని, భూముల వివాదాలకు సంబంధించిన సుమారు 2 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పోలియో రహిత సమాజ పరిరక్షణకు.. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు.

**..జూన్ 28 నుంచి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.**

**..డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 22:**
దేశంలో పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలన సాధించినప్పటికీ, పొరుగు దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వ్యాధి తిరిగి వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల స్వీకరణ అనంతరం పల్స్ పోలియో కార్యక్రమం, డయేరియా నివారణ చర్యలు, వర్షాకాలంలో తలెత్తే అంటువ్యాధుల నియంత్రణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో వంద శాతం విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం దేశం పోలియో రహితంగా ఉన్నప్పటికీ ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, నైజీరియా వంటి దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్నందున ప్రతి సంవత్సరం ప్రత్యేక రక్షణ చర్యగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28వ తేదీ ఆదివారం మొదటి రోజు పోలియో బూత్‌ల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామని, అదే రోజున 90 నుంచి 95 శాతం మంది పిల్లలను కవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. అనంతరం జూన్ 29, 30 తేదీలలో ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జననం నుండి ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమం కోసం దాదాపు మూడు లక్షల వ్యాక్సిన్ డోసులను సిద్ధం చేసి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తున్నామని, వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా కోల్డ్ చైన్ వ్యవస్థను పటిష్టంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం మెడికల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లతో మండల, గ్రామ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి తగిన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్య, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్డీఏ తదితర శాఖలను భాగస్వామ్యం చేసి వంద శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా 1320 పోలియో బూత్‌లు, 44 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 4 వేల మంది సిబ్బందికి శిక్షణ అందించామని, వలస కూలీలు నివసించే ప్రాంతాలు,




ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు, ఫ్యాక్టరీలు, పట్టణ మురికివాడలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పిల్లలు ఎవరూ మిస్ కాకుండా మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల నోటీస్ బోర్డులు, గ్రామ సభలు, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పోలియో కార్యక్రమంలో నమోదయ్యే వివరాలను వెంటనే యాప్‌లో నమోదు చేస్తూ రియల్ టైమ్ డేటా అప్డేషన్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పని చేయడమే కాకుండా రికార్డులను కూడా సకాలంలో నవీకరించడం ద్వారా ఖచ్చితమైన కవరేజ్ శాతం తెలుసుకోవచ్చని, మిగిలిన పిల్లలను ప్రత్యేక మాప్-అప్ రౌండ్ల ద్వారా కవర్ చేయవచ్చని తెలిపారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డయేరియా నియంత్రణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో డైరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, ఓఆర్ఎస్ కార్నర్ల ఏర్పాటు, ఇంటి వద్దే ఓఆర్ఎస్ ద్రావణం తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డీహైడ్రేషన్ లక్షణాలు కనిపించిన వెంటనే పిల్లలకు ఓఆర్ఎస్ అందించి అవసరమైతే ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు, డ్రైనేజీ సమస్యలను వెంటనే గుర్తించి సరిచేయాలని, కలుషిత నీటి వల్ల వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బహిరంగ మలవిసర్జన నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాల కారణంగా దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అవసరమైన చోట ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ చేపట్టి దోమల పెరుగుదలను అరికట్టాలని ఆదేశించారు.

అదేవిధంగా కలుషితమైన లేదా నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో పోలియో, డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు.


అదేవిధంగా కలుషితమైన లేదా నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో పోలియో, డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు.


అనంతరం పోలియో నివారణ గోడపత్రికను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ సంబంధిత వైద్య అధికారులు ఆవిష్కరించారు.

# తేళ్లపురిలో గ్రామంలో కాషాయ కమల వికాసం.!

**--బీజేపీలోకి భారీగా చేరిన కీలక నాయకులు**

**--జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సమక్షంలో కాషాయ తీర్థం -స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం.**









**ఆంధ్ర ప్రగతి గోస్పాడు జూన్ 22:**
గోస్పాడు మండలంలోని తేళ్లపురి గ్రామంలో భారతీయ జనతా పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వ్యక్తమవుతోంది. గ్రామానికి చెందిన పలువురు కీలక నాయకులు, కార్యకర్తలు సోమవారం బీజేపీలో చేరారు. నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు సమక్షంలో వీరంతా కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై..**
కేంద్ర ప్రభుత్వ ప్రజారంజక విధానాలు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు బీజేపీ బాట పట్టారు. పార్టీలో చేరిన వారిలో కాటంరెడ్డి చిన్న శివారెడ్డికాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఖాతాల శ్రీనివాసులుసుబ్బరాయుడు (సుబ్బు) ఖాతాల ఆంజనేయులుపెద్ద ఓబయ్యగ్రామ స్థాయిలో మంచి ప్రజాదరణ ఉన్న నాయకులు పార్టీలో చేరడంతో స్థానిక కమలనాథుల్లో కొత్త జోష్ నెలకొంది.

**ఘనంగా జెండా ఆవిష్కరణ.. ఇంటింటి ప్రచారం**
నాయకుల చేరికల అనంతరం తేళ్లపురి గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. కాషాయ జెండాను ఎగురవేసి, పార్టీకి అనుకూలంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలంతా కలిసి గ్రామంలో విస్తృతంగా ఇంటింటి పర్యటన చేపట్టారు.
ప్రతి గడపకూ వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.
స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం**
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. "జిల్లాలో బీజేపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే ప్రధాన ధ్యేయమని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు.



# 'రాజు 'లా మరణించాడు..!

**..నేత్రదానంతో ఇద్దరి జీవితాలలో వెలుగులు.**

**..మరణించిన పలువురికి ఆదర్శంగా నిలిచిన సిరివరం యువరాజు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 22:**మనిషి బ్రతికున్నప్పుడు పదిమందికి సాయం చేసిన వారిని రాజుల బతికాడు అని అంటారు సిరివరం యువరాజు మరణించిన అనంతరం కూడా ఇద్దరి జీవితంలో వెలుగులు నింపుతూ 'రాజు' లాగా మరణించాడు వివరాల్లోకి వెళితే నంద్యాల పట్టణంలోని సంజీవ్ నగర్ లో నివసించే రాజు బ్రెయిన్ స్ట్రోక్ తో ఆదివారం ప్రభుత్వాసుపత్రిలో మరణించారు కర్నూల్ నుంచి స్వచ్ఛంద సంస్థ కుటుంబ సభ్యులను సంప్రదించగా నేత్రదానం చేయటానికి అంగీకరించడంతో ఆదివారం రాత్రి ఇంటి వద్దకు చేరుకొని వారు యువరాజు నేత్రాలను తీసుకొని భద్రపరిచి రాజు కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు చెప్పి వెళ్లడం జరిగింది. ఎంతోమంది ఆపద సమయంలో అవయవదానం చేసేవారు లేక మరణిస్తున్నారు ప్రతి ఒక్కరూ రాజు కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకొని అవయవదానానికి ముందుకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు ఈ సంఘటనతో రాజు కుటుంబ సభ్యులను నంద్యాల పట్టణంలో ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పటిష్టంగా పూర్తి చేయాలి

**..యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 22:**
ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నాణ్యతా ప్రమాణాలతో పటిష్టంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ఎస్ఐఆర్, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పురోగతిపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా, అర్హత లేని పేర్లు తొలగించేలా బూత్ స్థాయిలో క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలనలు నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) ఎలాంటి ఇతర విధులు కేటాయించకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బీఎల్ఓలకు అత్యవసర పరిస్థితుల్లో సెలవుల మంజూరుకు సంబంధించి స్పష్టమైన విధానాన్ని పాటించాలని సూచించారు. ఒక రోజు సెలవు అవసరమైతే ఎంపీడీవో, రెండు రోజుల సెలవులకు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్ఓ), మూడు రోజులకుపైగా సెలవులు అవసరమైతే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) అనుమతి తప్పనిసరిగా పొందాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా బీఎల్ఓలుగా పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ అయినా, పదవీ విరమణ చేసినా లేదా ఇతర కారణాల వల్ల విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఏర్పడినా, వారిని వెంటనే రిలీవ్ చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

**యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను వేగవంతం చేయాలి**
యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఈ నెల 18వ తేదీన ప్రచురించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం జూన్ 19వ తేదీ నుంచి ప్రజల అభ్యంతరాలు, సూచనలు, సవరణల కోసం ఓపెన్ ఫోరమ్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా కుల వివరాలకు సంబంధించిన సవరణలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను జూన్ 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ వివరాలు, సామాజిక వర్గ సమాచారం, ఇతర అంశాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు ముందుకు రావాలని కోరారు. సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయడంతో పాటు, అందిన ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

# ప్రజా అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా సత్వరమే పరిష్కరించాలి.

**..పీజీఆర్ఎస్‌లో 349 ప్రజా దరఖాస్తుల స్వీకరణ.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 22:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారం అందించాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించినప్పటికీ తిరిగి రీఓపెన్ అయిన 96 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖలు నాణ్యమైన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికకు సంబంధించిన నాలుగు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తగిన ఎండార్స్‌మెంట్‌తో



త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 177 అర్జీల స్వీకరణ**
భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించే అవకాశాన్ని ఈ క్లినిక్‌లు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 177 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 2, అడంగల్ సవరణలకు సంబంధించినవి 15, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఏ భూములకు సంబంధించినవి 11, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 33, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 67, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 41, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 8 దరఖాస్తులు ఉన్నట్లు వివరించారు.

**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన కొన్ని ముఖ్య అర్జీలు**
1)డోన్ మండలం: తెలుగు రాజమ్మ అనే మహిళ తనకు వారసత్వంగా వచ్చిన సర్వే నంబర్ 460లోని నాలుగు ఎకరాల భూమిని తామే సాగు చేసుకుంటున్నప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేర్లు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
2)బండి ఆత్మకూరు మండలం: పెద్ద దేవలాపురం గ్రామ ఎస్సీ కాలనీలోని 80 సెంట్ల భూమిలో 30 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించి సాగు చేస్తున్నారని, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసి న్యాయం చేయాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. 3)సిరివెళ్ల మండలం: గోవిందపల్లె గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, గ్రామ పొలిమేరలోని సర్వే నంబర్ 378లో తనకు 2.14 ఎకరాల భూమి ఉండగా, ఆన్‌లైన్ రికార్డుల్లో 2.06 ఎకరాలు మాత్రమే నమోదయ్యాయని, మిగిలిన భూమిని కూడా రికార్డుల్లో నమోదు చేయాలని విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

# జూలై 1లోపు జలధార - జలహారతి పెండింగ్ పనులు పూర్తి చేయాలి.

**..పనుల నాణ్యత, నివేదికల ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 22:**
జలధార-జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన పనులను జూలై 1వ తేదీకి ముందుగానే పూర్తి చేసి లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధార-జలహారతి కార్యక్రమ పురోగతి, పెండింగ్ పనులు, థర్డ్ పార్టీ వెరిఫికేషన్, సక్సెస్ స్టోరీల తయారీ తదితర అంశాలపై ఎంపీడీఓలు, డ్వామా అధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జలధార-జలహారతి కింద మొత్తం 2,103 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 1,587 పనులు పూర్తయ్యాయని, ఇంకా 516 పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జూలై మొదటి వారంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మిగిలిన పనులను అత్యవసరంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జల్ సంచయ్ – జల్ భాగీదారి కార్యక్రమం కింద ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన వాటర్ కన్జర్వేషన్ నిర్మాణాలపై కేంద్ర జల కమిషన్ బృందం థర్డ్ పార్టీ వెరిఫికేషన్ నిర్వహిస్తోందని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫోటోలు, క్షేత్రస్థాయిలో ఉన్న నిర్మాణాలకు సరిపోతున్నాయా లేదా అన్న విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇంటెలిజెన్స్ విభాగంతో పాటు ప్రత్యేక థర్డ్ పార్టీ బృందాలు కూడా పనులను నిశితంగా పరిశీలిస్తున్నాయని పేర్కొన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో నాణ్యతను విస్మరించి, క్షేత్రస్థాయిలో పూర్తి కాకముందే ఆన్‌లైన్‌లో 'కంప్లీట్'గా నమోదు చేయవద్దని హెచ్చరించారు. క్షేత్రస్థాయి నివేదికలు, ఆన్‌లైన్ డేటా మధ్య ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్ పనుల పరంగా రుద్రవరం మండలం 52 పనులతో మొదటి స్థానంలో ఉండగా, డోన్ మండలంలో 46, కొలిమిగుండ్ల మండలంలో 43 పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆత్మకూరు మండలంలో 37, సిరివెళ్లలో 28, బేతంచెర్లలో 24, ఔకులో 27, జూపాడు బంగ్లాలో 15, ఆళ్లగడ్డలో 32, బండి ఆత్మకూరులో 19, నందికొట్కూరులో 13, కోయిలకుంట్లలో 14, మహానందిలో 10, కొత్తపల్లిలో 9, ఉయ్యాలవాడలో 14, చాగలమర్రిలో 10, నంద్యాల రూరల్‌లో 18, గోస్పాడులో 15, పాణ్యంలో 26, మిత్తూరులో 5, గడివేములలో 7, ప్యాపిలిలో 18, బనగానపల్లెలో 18, దొర్నిపాడులో 5, వెలుగోడులో 7, పగిడ్యాలలో 2, సంజామలలో 7, పాములపాడులో 1 చొప్పున పనులు పెండింగులో ఉన్నందున సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
జలధార కార్యక్రమానికి సంబంధించిన సక్సెస్ స్టోరీలను రూపొందించే సమయంలో కేవలం పనుల వివరాలు మాత్రమే కాకుండా, వాటి వల్ల సాధించిన స్పష్టమైన ఫలితాలను కూడా పొందుపరచాలన్నారు. ముఖ్యంగా చెరువుల అభివృద్ధి ద్వారా ఆయకట్టు స్థిరీకరణ లేదా విస్తరణ ఎంత మేరకు జరిగిందో వివరించాలన్నారు. అలాగే చెరువుల సామర్థ్యం పెరగడం వల్ల భూగర్భ జలమట్టంలో వచ్చిన మెరుగుదల, రైతులకు కలిగిన ప్రయోజనాలను నమోదు చేయాలని సూచించారు. పూడికతీత, మరమ్మతులు, స్లూయిస్ లీకేజీల నివారణ వంటి చర్యల ద్వారా నీటి నిల్వ సామర్థ్యం ఎంత పెరిగిందో స్పష్టంగా పేర్కొనాలన్నారు.

# రోజా కుంట లోని కళ్యాణ మండపం అభివృద్ధికి 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం

**-లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం కళ్యాణ్ మండపానికి ఆర్థిక సహాయం అందించిన గోళ్ళ రాజేష్.**

**..దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన యాగంలో పాల్గొన్న గోళ్ళ రాజేష్.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 22:**
పట్టణంలోని స్థానిక రోజాకుంటలో ఏర్పాటుచేసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం నందు కళ్యాణమండపం అధ్యక్షులు మేడం సుబ్బగురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన యాగం సందర్భంగా భారత దేశ ప్రజలందరూ సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో నిర్వహించిన సుదర్శనయాగం నందు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్ పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో భాగంగా దేవస్థాన అధ్యక్షుడు కమిటీ సభ్యులకు గోళ్ళ రాజేష్ ఇచ్చిన మాట ప్రకారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అధ్యక్షులు మేడం సుబ్బ గురుమూర్తి మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు గోళ్ళ రాజేష్, ప్రసన్న వెంకటేశ్వర స్వామి,ఆలయంతో పాటు శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందిచేందుకు గోళ్ళ రాజేష్ తనవంతు భాద్యతగా రోజా కుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం తో పాటు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధిలో తన సయంగా ఎల్లప్పుడు తోడ్పాటును అందిస్తానని ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కమిటీ పెద్దలకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మేడం శుబ్బ గురుమూర్తి, ఉపాధ్యక్షులు గొల్ల వెంకటలక్ష్మి, సెక్రటరీలు జీలా శైలజ, ఇటికాల చంద్రమౌళీశ్వర గుప్తా, అమరేష్,వెంకట సాయి కృష్ణ,వెన్నుపూస సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ కృషి ఫలితం

**..జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ జీవో విడుదల.**





PROCEEDINGS OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE, NANDYAL
PRESNENT:: Smt RAJA KUMARI GANIYA, I.A.S.,

Rc.No: 1646 /A1/2025 Dt: 21-06-2026

Sub: School Education – Nandyal - Providing of 50% fee concession to Journalist Children in Private Educational Institutions - Nandyal District - Instructions issued - Reg.

Ref: 1) Representation of the District Committee of Andhra Pradesh working Journalist Federation, Nandyal, dt: 15.06.2026

2) Representation of the Andhra Pradesh Union of Working Journalists (APUWJ), Nandyal, Dt 15.06.2026.

<<o>>

In the references cited , the representatives of Jounalists' Associations of Nandyal have submitted representations requesting that a 50% fee concession be provided to the children of Journalists in Private Un-Aided Educational Institutions of Nandyal district.

In this connection, all the Correspondents of Private Schools in the district are requested to provide 50% fee concession to the children of BPL families of Accredited Journalists in the district for the academic year 2026-2027 .

All the Deputy Educational Officers and Mandal Educational Officers in the district are here by instructed to take necessary action for providing of 50% fee concession to the children of Journalist by the all the Private Un-Aided Schools in their jurisdiction without fail.

Receipt of these proceedings should be acknowledged.

RAJAKUMARI GANIYA, I.A.S
Collector & District Magistrate
Nandyal district

To
All the Correspondents & Head Masters of all Private Schools in the District
All the Deputy Educational Officers / Mandal Educational Officers in the District
Copy to the Representatives of Journalists Associations
Copy to the DPRO, Nandyal.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 22:**
ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ (ఐఆర్ఏ) యూనియన్ నాయకుల నిరంతర కృషి ఫలితంగా అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా జీవో విడుదల చేశారు. గత శనివారం ఐఆర్ఏ యూనియన్ నాయకులు జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి గనియా సమస్యను సానుకూలంగా పరిశీలించి, జర్నలిస్టుల కుటుంబాలకు పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సోమవారం రోజున ఈ విషయమై ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన హామీని తూచా తప్పకుండా నిలబెట్టుకుంటూ సోమవారం సంబంధిత జీవోను విడుదల చేయడం పట్ల జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. గత సంవత్సరం కూడా పలుమార్లు కలెక్టర్ ని కలిసి మరియు మంత్రి గారిని కూడా కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఎట్టకేలకు ఈ విద్యా సంవత్సరానికి గాను జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టుల పిల్లల విద్యాభారం కొంత మేర తగ్గించే ఈ నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి జీవో విడుదల చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించిన నంద్యాల జిల్లా కలెక్టర్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 22:**



జిల్లాలోని బీపీఎల్ కుటుంబాలకు చెందిన అక్రెడిటెడ్ జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గనియా ఆదేశాలు జారీ చేశారు.జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి జర్నలిస్టుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించి ఫీజు రాయితీ కల్పించాలని వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జిల్లా పరిధిలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలు చేయాల్సి ఉంటుంది. రాయితీ అమలును డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ నిర్ణయంతో పెరుగుతున్న విద్యా ఖర్చుల నేపథ్యంలో జర్నలిస్టు కుటుంబాలకు గణనీయమైన ఊరట లభించనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విలేకరులకు ఈ రాయితీ ఉపయోగపడనుంది.కలెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని జర్నలిస్టు సంఘాల నాయకులు స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు.

# నాణ్యమైన పరిష్కారాలు చూపి అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడండి.

**..అధికారులు పీజీఆర్ఎస్ అర్జీలపై మరింత బాధ్యతతో వ్యవహరించాలి.**

**..రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులను పూర్తిగా తగ్గించాలి.**

**..పెండింగ్‌లో ఉన్న అర్జీలు, ఫిర్యాదులను త్వరితగతిన పూర్తి చేయాలి.**

**..జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 22:**
ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డి ఆర్ ఓ) వెంకటనారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను డి.ఆర్.ఓ స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని, పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలని డి.ఆర్.ఓ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, అందుకు గల కారణాలను పూర్తిగా వివరించడంతో పాటు, తీసుకోబోయే చర్యలపై కూడా అర్జీదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకటరమణారెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డా. లోకరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమంలో పంటలపై అవగాహన.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 22:** నంద్యాల మండలంలోని రాయమల్పురం, పులిమద్ది, భీమవరం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ ఉపసంచాలకులు గంగాధరరావు, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వరి సాగు తగ్గించి పప్పుధాన్యాల సాగు పెంచాలని రైతులకు వివరించారు.మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను అనుసరించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అలాగే యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీని ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న విధానాన్ని రైతులకు వివరించారు.కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, రైతు సేవా సిబ్బంది తేజస్విని, రాముునాయక్, లలితతో పాటు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయండి.

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు/జొన్నగిరి జూన్ 22:** రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో ఈ నెల 24 వ తేదీన పర్యటిస్తున్న సందర్భంగా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.
ఈ నెల 24 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరిలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్ లో పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, వ్యూ పాయింట్, బహిరంగ సభ, స్టాళ్ల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్ కో ఆర్డినేట్స్, లైటింగ్ తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించారు. మైనింగ్ వ్యూ పాయింట్, బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలిస్తూ, బహిరంగసభకు సుమారు 5 వేల నుంచి 10 వేల మంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వేదిక ఏర్పాట్లు, ప్రజలకు తాగునీరు, భోజన వసతి, మరుగుదొడ్లు, పార్కింగ్, సీటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, తదితర అంశాలపై ఎస్పీ, కలెక్టర్ చర్చించి పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.
కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర,జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రదీప్ కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, , తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 128 ఫిర్యాదులు.

**..ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు.**

**..చట్ట పరిదిలో న్యాయం చేస్తామని ప్రజలకు భరోసా. -జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 22:**



నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 128ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.
చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# బాలికల భవిష్యత్తుకు సుకన్య భరోసా.!

## ..నంద్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 22:**
బాలికల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు.సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయం (హెడ్ పోస్ట్ ఆఫీస్) లో సుకన్య సమృద్ధి యోజన పథకానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు పథకం విశిష్టతలు, బాలికల భవిష్యత్తు కోసం అందించే పొదుపు అవకాశాలు, అధిక వడ్డీ ప్రయోజనాలు, పన్ను రాయితీలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ.. బాలికల విద్య, ఉన్నత చదువులు, వివాహ అవసరాలకు ఆర్థికంగా అండగా నిలిచే ఈ పథకం దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలకు ఉపయోగపడుతోందన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ కుమార్తెల పేరుతో సుకన్య సమృద్ధి ఖాతాలు ప్రారంభించి వారి భవిష్యత్తును సురక్షితం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారులు, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కొట్టే మల్లికార్జున, సీతమ్మ, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్

### షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ

### విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు

**హైదరాబాద్,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :**



హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సంధ్య థియేటర్ కేసులో నాంపల్లి కోర్టుకు సినీనటుడు అల్లు అర్జున్ హాజరు కాలేదు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి కేసు విచారణను జులై 6కి వాయిదా వేశారు. అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఎ11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా అర్జున్ కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. అయితే అల్లు అర్జున్ గైర్హాజరుకు గల కారణాలను న్యాయస్థానానికి ఆయన తరఫు న్యాయవాది వివరించారు. సంధ్యా థియేటర్ యాజమాన్యాన్ని తొలి పదిమంది జామితాలో చేర్చగా, మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ నాంపల్లి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు నాంపల్లి కోర్టు సిద్ధమవుతోంది. ఈ కేసు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారగా, కోర్టు తదుపరి విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# నేడు ఎపి కేబినేట్ భేటీ

## కీలక నిర్ణయాలపై చర్చించే అవకాశం



**అమరావతి,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :**సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళశారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఇప్పటికే ఆమోదించిన పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. మొత్తం రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించే అవకాశం ఉండగా, వీటి ద్వారా రాష్ట్రంలో 29,677 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా 10 సంస్థల ఏర్పాటుకు కూడా ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ నిర్ణయం రాష్ట్రంలో సాంకేతిక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన నిధుల విడుదలపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఇక, కేబినెట్ అజెండా ముగిసిన అనంతరం కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు సమగ్రంగా వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులకు దిశానిర్దేశర చేయనున్నట్లు తెలుస్తోంది.

# ఆటోనగర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

## -ఎస్ డి పి ఐ డిమాండ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 22:**
నంద్యాల పట్టణంలోని ఆటోనగర్ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న ప్రధాన సమస్యలైన డ్రైనేజీ, దెబ్బతిన్న రోడ్లు, వీధి లైట్ల కొరత, మంచినీటి సరఫరా సమస్యలపై ఎస్ డి పి ఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలిసి ప్రాంతాన్ని సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులను తెలుసుకొని వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది.
రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ అతఉల్ల ఖాన్ మాట్లాడుతూ, నంద్యాల ఎమ్మెల్యే మరియు రాష్ట్ర మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ దాదాపు 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ, 40 సంవత్సరాలుగా ఆటోనగర్ ప్రజలను వేధిస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా, ఎమ్మెల్యేలు మారినా ఆటోనగర్ సమస్యలను పూర్తిగా పరిష్కరించే నాయకుడు నంద్యాలకు దొరకలేదని





అన్నారు.ఎస్ టి పి ఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుస్సేన్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో స్థలాల విషయంలో అవకతవకలు జరిగాయని మంత్రి ఫరూక్ స్వయంగా ప్రకటించి సీఐడీ విచారణ వేయిస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ ప్రకటనలు కేవలం మాటలకే పరిమితం కాకుండా వెంటనే సీఐడీ ఎంక్వయిరీకి ఆదేశాలు జారీ చేసి ఆటోనగర్‌లో జరిగిన అక్రమాలు, అవినీతి వ్యవహారాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ఎస్ డి పి ఐ పార్టీ డిమాండ్ చేసింది. ఎస్ డి పి ఐ నంద్యాల అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మజీద్ ఖాన్ మాట్లాడుతూ ఆటోనగర్ అభివృద్ధి కోసం రూ.10 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి ఫరూక్ చెబుతున్నారని, ఆ నిధులు కేవలం ప్రకటనలు మరియు ప్రెస్ మీట్లకే పరిమితం కాకుండా వెంటనే పనులు ప్రారంభించి డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, వీధి లైట్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్ డి పి ఐ పార్టీ ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను డిమాండ్ చేసింది.
అసెంబ్లీ కమిటి సభ్యులు కరిముల్లా మాట్లాడుతూ ఆటోనగర్ లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.ఆటోనగర్ ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఎస్ డి పి ఐ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# అనాథ విద్యార్థులకు పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్ల పంపిణీ.

## ..యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యతకు నిదర్శనం.

**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ, జూన్ 22:**
ఆళ్లగడ్డ పట్టణంలోని బాలసదనం అనాథ ఆశ్రమంలో నివసిస్తున్న 30 మంది విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆళ్లగడ్డ శాఖ ఆధ్వర్యంలో పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడేలా మొత్తం 60 పుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు, చిన్నారుల ఆనందాన్ని దృష్టిలో ఉంచుకుని బిస్కెట్లు, చాక్లెట్లను అందజేశారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యా ప్రోత్సాహం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ అయ్యప్ప రెడ్డి, ఆళ్లగడ్డ శాఖ మేనేజర్



రాజశేఖర్ రెడ్డి హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు అని, ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి భవిష్యత్తు అభివృద్ధికి తోడ్పడటం బ్యాంకు సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జీవితంలో మంచి స్థాయికి ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. బాలసదనం నిర్వాహకులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సమాజం తమకు అండగా ఉందనే భావనను కలిగిస్తాయని పేర్కొన్నారు.

# డబ్బులు లేక ఏ ఒక్కరూ చికిత్సకు దూరం కావద్దు

### 25 ఏళ్ల క్రిలం ఓ సదాశయంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించాం

### రజతోత్సవ వేడుకల్లో బసవతారకం చైర్మన్ బాలకృష్ణ

### చంద్రబాబు, వెంకయ్య, ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల హాజరుద





**హైదరాబాద్,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :**
పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేని వారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం. ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం.. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం అని బాలకృష్ణ అన్నారు. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు- పురందేశ్వరి దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ, సినీనటి గౌతమి తదితరులు పాల్గొన్నారు. రజతోత్సవ వేడుకల సందర్భంగా ఆస్పత్రి ప్రస్థానం, వైద్య సేవలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. క్యాన్సర్ చికిత్స రంగంలో ఆస్పత్రి అందిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అతిథులు అభినందించారు.

# రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

## యూరియా ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి -వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక

**అమరావతి,జూన్ 22 ఆంధ్ర ప్రగతి :** రైతులను ఇబ్బంది పెడితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.
సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఖరీఫ్-2026 ఎరువుల లభ్యత, పంపిణీపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు, ఎరువుల కంపెనీ, అసోషియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. యూరియా, డీఏపీతో కాంప్లెక్స్ ఎరువుల బలవంతపు విక్రయాలు ఆపాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులనే అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవసరమైన మేర కన్నా అధిక ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి చెప్పారు. యూరియా సరఫరాలో ఎలాంటి



కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, అధిక ఎరువుల వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. ఎమ్ఆర్‌పీ ధరకే యూరియాను విక్రయించాలని, ఎమ్ఆర్‌పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లకు మంత్రి హెచ్చరిక జారీ చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండాలన్నారు. గతంలోలా అక్రమాలు, ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించబోమని.. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.